## వీరేంద్రనాథ్

స్టేషన్‌లోనే నిన్ను చేసుకుంటాను" అనే వాడు.

మా పల్లెటూళ్ళల్లో చాలా వరకు ప్రేమలు గడ్డివాముల వెనుకే పుట్టి, అక్కడే సమాధి అయిపోతాయి. కానీ ఆనంద్ నన్ను ఒక్కసారి కూడాస్పృశించ లేదు అసలు ఆ ప్రయత్నమే చేయలేదు. అతడెప్పుడూ ప్రేమకన్నా ఎక్కువగా వివాహంగురించే మాట్లాడేవాడు. అందుకే అతడంటే రోజు రోజుకి నాకు ప్రేమతో పాటు గౌరవంకూడా పెరగసాగింది. ఎలాగో ఒకలాగా నేను నా తల్లిని ఎదిరించ గలను. కానీ నా స్నేహితురాలి విషయమే నాకు బాధగావుంది. ఎంతతొందరగా ఈ విషయం బయట పడితే అంత బావుణ్ణు అని పించింది.

చివరికారోజు నేనే తరళకి అంతా చెప్పెయ్యాలనుకున్నాను.

చాలా రిహార్సల్స్ వేసుకున్నాను.

తరళ నన్ను బాగా తిడుతుందని నాకు తెలుసు. కానీ మీరైనా నన్ను అర్థం చేసుకుంటే చాలు. నేను అనివిసెంటుని, నైటింగేల్‌నీ కాదు. నేను పుట్టినకులానికి, నాకున్న అందానికి నాకు వివాహమవటం కలలో మాట. అప్పుడే వూళ్ళో పెద్దలు 'లోపాయి కారి'గా కబుర్లు చేస్తూనే వున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఒక చెయ్యి నన్ను ఈ వూబిలోంచి పైకి లాగటానికి ప్రయత్నిస్తూవుంటే. దాన్ని అందుకోక పోవటం స్వార్థరాహిత్యమా? మూర్ఖత్వమా? తరళ విషయం అలాకాదు. ఆమె అతడిని-చేసుకోవాలంటే ఎన్నో మెట్లుదిగి రావాలి. ఆమెకు అంత అవసరం ఏముంది?

తరళ ఎంతమంచిదో నాకు తెలుసు.

మా ఇద్దరి విషయమూ తెలిస్తే బాగా తిట్టినా, తరువాత నవ్వేస్తుంది. అలాగే గానీ జరుగుతే, ఇన్నాళ్ళూ నేను అనుభవించిన టెన్షన్‌అంతా అనవసరమైంది. ఒక్కసారే శుభలేఖ ఇస్తే తను చాలాహర్ట్ అవుతుంది. ముందు చెప్పటమే మంచిది.

ఇన్నిరిహార్సిల్స్ వేసుకుని నేను తన దగ్గిరకు వెళ్ళేసరికి తను నవ్వుతూ ఎదురొచ్చింది. "రా...రా...నీకో గుడ్ న్యూస్" అంటూ.

"ఏమిటి?" అన్నాను.

"మా పెళ్ళికి ఆనంద్ వప్పుకున్నాడు"



## ఆమె—నేను

## మినీ కథ

బస్సు గురించి ఎదురు చూస్తున్న నా దృష్టి అప్పుడే అక్కడికి వచ్చిన యువతీ యువకుల పైన పడింది "అబ్బ ఎంత అందంగా వుంది ఆ అమ్మాయి" అనుకున్నాను. వాళ్లు భార్యా భర్తలా? అప్రయత్నంగా ఆమె మెడలో చూశాను. మంగళ సూత్రం కనబడలేదు. అన్నా చెల్లెళ్ళు కాబోలు అనుకున్నాను.

అతడు మాటి మాటికీ వాచీ చూసుకొని గాబరా పడుతున్నాడు. కొంతసేపు సందేహించి నా దగ్గరకు వచ్చి "మీరెంత వరకు వెళతారు" అన్నాడు.

"పురుషోత్తమపురం" అన్నాను.

"మా చెల్లెలు ప్రహ్లాదపురం వెళ్ళాలి. నాకు ఇక్కడ అర్జెంట్ పని వుంది. మీరు కొంచెం ఆమెకు తోడుగా వుంటారా" అన్నాడు ఆమె వైపు చూపిస్తూ.

నే వెళ్ళే దారే కనుక "అలాగే. మీరు వెళ్ళండి, మేం బస్సురాగానే వెళతాం" అన్నాను. అతడు వెళ్ళిపోయాక కొంతసేపటి వరకు ఆమె మాట్లాడ లేదు. మొహమాట పడ్డది.

"చాలా సేపు అయింది, ఇంకా బస్సు రాలేదు" అన్నాను నేనే.

"అవునండి, అపుడే అరగంట అయింది" అంది.

మా మాటలు విన్న ప్రక్కనున్న ముసలమ్మ "మీరెళ్ళాల్సింది మూడు నాలుగు మైళ్ళేగా నడిచి వెళ్ళి పొండి, మాయదారి బస్సు ఎప్పుడొస్తుందో" అంది.

ఆమె సందేహిస్తూ "ఇంకో పది నిమిషాలు చూద్దాం" అంది.

పావుగంట గడిచింది.

"నడిచి వెళ్ళినా ఈ పాటికి చేరి వుండే వాళ్ళం" అన్నాను నేను.

ఆమె "పదండి, ఇంకేం చేస్తాం" అంది. పొలాల గట్ల వెంట నడవ సాగేను నేను. దగ్గర దారని చెప్పి, నన్ననుసరించిందామె.

ఆమెను పరిశీలిస్తూ నడవసాగేను నేను. పచ్చని ఛాయలో మెరిసి పోతోందామె. తలలో సంపెంగ పూలు పెట్టుకుంది. నాకు సంపెంగ పూలంటే చాలా ఇష్టం. ఆమె నన్ను చాలా ఆకర్షించింది. నేను స్వతహాగా స్నేహశీలిని కాని ఆమె ఎందుకో బెరుగ్గా వుంది. కొంత దూరం నడిచాక హఠాత్తుగా చీకటి కమ్మేసరికి తలయెత్తి ఆకాశం వైపు చూశాం. ఎప్పుడు కమ్మాయో మేఘాలు ఆమె ఎర్రని క్రింది పెదవిపై పడిందో చినుకు. నా నొసటిపై పడిందింకోచినుకు. చిటపట చినుకులు పడి నేలంతా గమ్మత్తైన సువాసన వెదజల్ల సాగింది. పంట చేల మధ్య మేం అలా నడిచి వెళుతుంటే చిత్రమైన అనుభూతి కలుగసాగింది.

మా నడక వేగం పెరిగింది. ఆమె చీర కుచ్చిళ్ళు ఎత్తి పట్టుకొని నడవసాగింది. సంపెంగ రంగు పాదాలు తళుక్కు మన్నాయి. ఆమె తల దించుకొని నడుస్తోంది. ఆమెతో మాట్లాడాలని వున్నా మౌనంగా ఉండక తప్పలేదు. నేల తడిచి చిత్తడిగా అయి నడక వేగం తగ్గింది. తడిసిన నేల మీద ఆమె పాగం జారింది. అప్రయత్నంగా ఆమె చేయి పట్టుకున్నాను. ఆమె తల యెత్తి నా వైపు చూసింది. ఆ కళ్ళలో ఏ భావం చదవలేక పోయాను. ఆ చేయి పట్టుకుని అలాగే నడవ సాగాను. నా చేతిలో ఆమె చేయి వణుకుతోంది. ఆమె తెల్లని చీర, జాకెట్టు తడిసి పోయి ఆమె అందాలు బయల్పడ సాగాయి. నాది చాక్లెట్ కలర్ డ్రెస్ కావటం వలన కొంత నయం. ఆమె చేయి ఇప్పుడు నా చేతిలో వెచ్చగా మెత్తగా ఒదిగి వుంది. వానతో పాటు చలిగాలి వీయసాగింది. అప్రయత్నంగా ఇంకా దగ్గరగా నడవ సాగాం. ఇద్దరిలోను వేడి వుంది. ఇద్దరికి కూడా కావలసింది వేడే. కాని...ఏమి లాభం! అనుకొని నడవసాగాను.

నేను ఆలోచనలలో ఉండగానే ప్రహ్లాదపురం చేరాం. ఆమె వస్తానండి అని చెప్పి వెళ్ళిపోయింది. నేను ఇల్లు చేరుకుని తలుపు తట్టాను.

తలుపు తీసిన అమ్మ "ఏం లక్ష్మి ఇంత లేటయింది" అంది.

కారణం చెప్పాను.

"సర్లే, ఆ తడి చీర విప్పి, పొడి చీర కట్టుకొని భోజనానికి రా" అంది.

—కర్నాటకపు వేంకట రమణమూర్తి